ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 తమిళనాడు TAMILNADU

మంగళవారం 9 జనవరి 2024

మళ్లీ ముంచెత్తిన వానలు

జల దిగ్బంధంలో పలు జిల్లాలు ● 11వ తేదీ వరకు భారీ వర్ష సూచన



చెన్నైలో వర్షం దృశ్యం

ప్యారీస్, జనవరి 8: రాష్ట్రాన్ని భారీ వర్షం ముంచెత్తింది. ఆదివారం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెంగల్పట్టు, తిరువణ్ణామలై, తిరువారూర్, వేలూరు, నాగపట్టినం, మైలాడుదురై, విల్లుపురం, కడలూరు, రాణిపేట, కళ్లకుర్చి తదితర 10 జిల్లాల్లోని వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. భారీ వర్షాల కారణంగా తిరువళ్లూరు, తిరువణ్ణామలై, నాగపట్టినంలోని రెండు తాలూకాలు, రాణిపేటల్లో అన్ని విద్యా సంస్థలకు విద్యా శాఖ సెలవు ప్రకటించింది. గరిష్ఠంగా నాగపట్టినం జిల్లా సీర్గాళిలో 22 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈనెల 11వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 30 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేసింది. సముద్ర తీర జిల్లాలైన చెన్నై, కాంచీపురం, కడలూరు, నాగపట్టినం, తిరునెల్వేలి, రామనాథపురం, కన్నియాకుమారి తదితర జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. డెల్టా జిల్లాల్లో పలు ప్రాంతాల్లో గత 24 గంటల్లో అత్యధికంగా 24 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాజధాని నగరం చెన్నై గత రెండు రోజులుగా తేలికపాటి వర్షపు జల్లులతో పాటు పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురుస్తున్న విషయం తెల్సిందే. కోయంబేడు, వడపళని, ఈక్కాట్టుతాంగల్, గిండీ, వేళచ్చేరి, సైదాపేట, అడయార్, టి.నగర్, మైలాపూర్, రాయపురం, రాయపేట, పెరంబూరు, వెప్పేరి, ఎగ్మోర్, చెట్‌పేట్, కొరుకుపేట, వ్యాసార్‌పాడి, తిరువొత్రియూరు తదితర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షం కారణంగా పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, సిబ్బంది ఇబ్బంది పడ్డారు.

డెల్టా జిల్లాల్లో నీట మునిగిన వరి

రాష్ట్రంలో రెండు మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ కారణంగా డెల్టా జిల్లాల్లో వందలాది ఎకరాల్లో వరి పంట నీటమునిగింది. దీంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నారు. తిరువారూరు జిల్లా నన్నిలం ఆదంబాళ్ వీధికి చెందిన రాజశేఖర్ అనే దినసరి కూలి కుమార్తె మోనిషా (9) ఇంటి గోడ కూలడంతో మృతి చెందింది. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఇంటిగోడ కూలిపోయింది. ఈ ప్రమాదంలో మోనిషాతో కుమారుడు మోహన్‌దాస్ (11)లు గాయపడగా, వారిని తిరువారూరు ప్రభుత్వ వైద్య కాలేజీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే, మోనిషా మాత్రం చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మరోవైపు, నాగపట్టినం జిల్లాలో కొల్లిడం, సీర్గాళి, తరంగంబాడి, పూంపుహార్, మైలాడుదురై ప్రాంతాల్లో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అనేక లోతట్టు ప్రాంతాలతో పాటు చెరకు, అరటి, వరి పొలాల్లోకి నీరు చేరింది. మరుదంగుడి, తిరుముల్లైవాసల్, ఎమనన్ తదితర పలు గ్రామాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వేలాది ఎకరాల్లోని వరి నీటి మునిగింది.

భారీ వర్ష సూచన ....

తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లో ఈ నెల 11వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బంగాళాఖాతంలో గంటకు 29 నుంచి 35 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయని, దీని ప్రభావం కారణంగా కోస్తా జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని, అందువల్ల మత్స్యకారులు ఉత్తర్వులు వచ్చే వరకు సముద్రంలో చేపల వేటకు వెళ్లవద్దని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. అదేవిధంగా కేంద్ర పాలితమైన పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో కూడా వర్షాలు కురుస్తాయని తెలిపింది.

.... ఆ జిల్లాలకు ఎల్లో అలెర్ట్

ఈ భారీ వర్షాల కారణంగా రాణిపేట, వేలూరు, తిరుపత్తూరు, పెరంబలూరు, తిరుచ్చి, నామక్కల్, సేలం, కరూర్, పుదుక్కోట, తంజావూరు జిల్లాల్లో అల్పపీడనం ప్రభావం కారణంగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని, ఈ జిల్లాలకు చెందిన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. అదేవిధంగా రాగల 24 గంటల్లో పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. భారీ వర్షాల కారణంగా సంభవించే వరదల సమయంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆయా జిల్లాల కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది.

నేడు బస్సులు తిరిగేనా?

త్రైపాక్షిక చర్చలు విఫలం

సమ్మెకు సిద్ధమవుతున్న కార్మికులు



మంత్రి శివశంకర్

చెన్నై, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా శాఖ కార్మికులు ఈనెల 9న మంగళవారం నిరవధిక సమ్మెను ప్రారంభించేందుకుసిద్ధమవుతున్నారు. కార్మికుల డిమాండ్లను పరిష్కరించేందుకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి శివశంకర్ అధ్యక్షతన మూడోసారి నిర్వహించిన త్రైపాక్షిక చర్చలు విఫలమయ్యాయి. దీంతో రాష్ట్ర రవాణా సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు ఆరు డిమాండ్ల సాధన కోసం ఈ నెల 9వ తేదీ నుంచి సమ్మె చేయనున్నట్లు ప్రకటించారు. రవాణా సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, సంస్థల ఆదాయ వ్యయాలను సక్రమంగా లెక్కగట్టి నష్టాల్లో ఉన్న సంస్థలకు ఆర్థిక పరిపుష్టి కలిగించేలా ప్రభుత్వం బడ్జెట్‌లో తగినంత నిధులు కేటాయించాలని, రవాణా శాఖ పింఛనుదారుల కరువు భత్యం బకాయిలు చెల్లించాలని, కొత్త పింఛన్ పథకం అమలు చేయకూడదని, 15వ వేతన సంఘం సిఫారసుల అమలుకు చర్యలు చేపట్టాలని కోరుతూ నిరవధిక సమ్మె ప్రారంభించనున్నట్లు కార్మిక సంఘాల నాయకులు ప్రకటించారు. దీంతో రవాణా శాఖ మంత్రి శివశంకర్ సమక్షంలో కార్మిక సంఘాల ప్రతినిధులు, రవాణా సంస్థ ఉన్నతాధికారులు, కార్మికశాఖ ఉన్నతాధికారులు కలిసి రెండు సార్లు చర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం తేనాంపేటలోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంలో మంత్రి శివశంకర్ ఆధ్వర్యంలో త్రైపాక్షిక చర్చలు జరిగాయి. ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఇళంగో, మహానగర రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆల్బీజాన్, కార్మికుల తరఫున సీఐటీయూ, ఏఐటీయూసీ, అన్నా కార్మిక సంఘం ప్రతినిధులు హాజరయ్యారు. సుమారు గంటకు పైగా కొనసాగిన ఈ సమావేశంలో కార్మికుల ఆరు డిమాండ్లను ప్రభుత్వం ఆమోదించకపోవడంతో చర్చలు విఫలమయ్యాయి.

పొంగల్‌కు 16,932 ప్రత్యేక బస్సులు...

సంక్రాంతి పండుగను స్వస్థలాల్లో జరుపుకునేందుకు వెళ్లే ప్రయాణికుల కోసం 16,932 ప్రత్యేక బస్సులు నడుపుతామని మంత్రి శివశంకర్ తెలిపారు. ఈనెల 15న రాష్ట్రమంతటా సంక్రాంతి పండుగను రాష్ట్ర ప్రజలంతా ఘనంగా జరుపుకోనున్నారని, ఆ సందర్భంగా పశువుల పండుగ, కనుమ పండుగ, శని, ఆదివారాలు అంటూ వరుసగా ఐదు రోజులు సెలవులు కావడంతో ఈ యేడాది చెన్నై నుంచి స్వస్థలాలకు వెళ్లే వారి సంఖ్య పది లక్షలు దాటుతుందని అధికారులు భావిస్తున్నారు. దీంతో ఈ నెల 12 నుంచి 14 వరకు సంక్రాంతి స్పెషల్ బస్సులు నడిపే విషయమై సచివాలయంలో సోమవారం ఉదయం అధికారులతో సమావేశమయ్యారు. రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి గోపాల్, ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గోపాల్ దితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని ప్రధాన నగరాల నుంచి ఇతర ప్రాంతాలకు, చెన్నై నుంచి ఇతర జిల్లాలకు ప్రత్యేక బస్సులను నడిపేందుకు చేపట్టాల్సిన చర్యలు గురించి మంత్రి శివశంకర్ సమీక్షించారు. ఈ సమావేశానంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రధాన నగరాల నుంచి ఈనెల 12 నుంచి 14 వరకు 17 వేల బస్సులు, చెన్నై నుంచి 11 వేల బస్సులు నడపాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇదే విధంగా సంక్రాంతి సెలవులు ముగిసిన తర్వాత ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు సుమారు 16వేల ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ యేడాది సేలం, కోయంబత్తూరు, దక్షిణాది జిల్లాలకు వెళ్లే ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ బస్సులన్నీ కిళంబాక్కం బస్‌స్టేషన్ నుంచి, ఇతర నగరాలకు వెళ్లే బస్సులు కోయంబేడు బస్‌స్టేషన్ నుంచి నడుపుతామని ఆయన చెప్పారు. ప్రయాణికుల రద్దీని బట్టి మాధవరం, తాంబరం, పూందమల్లి బస్టాండ్ల నుంచీ ప్రత్యేక బస్సులు నడుపుతామని తెలిపారు.

బస్సులు నడుపుతాం...

రవాణా సంస్థలలో కొన్ని కార్మికుల సంఘాలు సమ్మెకు దిగినా మంగళవారం రవాణా సంస్థ బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్టు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి శివశంకర్ తెలిపారు. కార్మిక సంఘాల ప్రతినిధులతో జరిపిన చర్చలు విఫలమైనట్లు ఆయన చెప్పారు. ప్రభుత్వ రవాణా సంస్థలలోని కార్మిక సంఘాల్లోనే డీఎంకే అనుబంధ కార్మిక సంఘం తొళిలాలర్ మున్నేట్ర సంఘం సమ్మెలో పాల్గొనక పోవడం వల్ల యథావిధిగా బస్సులను నడిపేందుకు తగు చర్యలు చేపడుతున్నామని మంత్రి శివవంకర్ తెలిపారు.

రవాణా కార్మికుల సమ్మెపై స్టే విధించాలంటూ పిటిషన్

పెరంబూర్, జనవరి 8: రవాణా కార్మికులు చేపట్టిన సమ్మెపై స్టే విధించాలని కోరుతూ హైకోర్టు మదురై ధర్మాసనంలో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. సంక్రాంతి పండుగ సమీపిస్తున్న తరుణంలో, ప్రభుత్వ రవాణా కార్మికులు ప్రకటించిన నిరవధిక సమ్మె చట్ట విరుద్ధమని, ఈ సమ్మెపై స్టే విధించాలని పిటిషన్‌లో కోరారు. అలాగే ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని కూడా పిటిషనర్ అభ్యర్థించారు. ఈ పిటిషన్‌ను సోమవారం పరిశీలించిన న్యాయస్థానం.. మంగళవారం విచారణ చేపడతామని ప్రకటించింది.



సీఎంతో పెట్టుబడిదారులు

అంతర్జాతీయ సదస్సు

విజయవంతం

- రూ.6.64లక్షల కోట్ల పెట్టుబడుల సమీకరణ
- 26.90లక్షల మందికి ఉపాధి
- 20యేళ్ల ప్రగతికి సుస్థిర పునాది
- ముగింపు సభలో సీఎం స్టాలిన్ ప్రకటన

చెన్నై, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం రూ.100 కోట్లతో రెండు రోజులపాటు నిర్వహించిన అంతర్జాతీయ పెట్టుబడిదారుల సదస్సు విజయవంతమైందని, అంచనాలకు మించి దేశవిదేశాల నుంచి పెట్టుబడులు వెల్లువలా వచ్చాయని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. నందంబాక్కం ట్రేడ్ సెంటర్‌లో సోమవారం సాయంత్రం జరిగిన సదస్సు ముగింపు సభలో ఆయన ప్రసంగిస్తూ... సదస్సు ద్వారా రూ.6లక్షల 54 వేలా 180 కోట్లకుపైగా పెట్టుబడులు సమీకరించడం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు. ఈ పెట్టుబడులతో రాష్ట్రమంతటా 26,90,657 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కలుగనున్నాయని సభికుల హర్షధ్వానాల నడుమ ప్రకటించారు. ఈ సదస్సు సాధించిన ఫలితాలు రెండు దశాబ్దాల రాష్ట్ర పురోగమనానికి సుస్థిరమైన పునాది పడిందన్నారు. ప్రపంచం గర్వించదగ్గ రీతిలో సదస్సును నిర్వహించిన పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజాను, ఇతర మంత్రులు, అధికారులను మనసారా అభినందిస్తున్నానని చెప్పారు. ముఖ్యమంత్రి పదవిని చేపట్టినప్పటి నుంచి ఇప్పటి దాకా 44 కొత్త పరిశ్రమలకు శంకుస్థాపన చేశానని, 27 పరిశ్రమలకు ప్రారంభోత్సవం చేశానని, వీటి ద్వారా 74,757 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కలిగాయని చెప్పారు. సదస్సుద్వారా సమీకరించిన పెట్టుబడులతో రాష్ట్రం మరింత ఆర్థిక ప్రగతిని సాధిస్తుందని, అదే సమయంలో వన్ ట్రిలియన్ అమెరికన్ డాలర్ల ఆర్థిక పురోగమనాన్ని సాధించగలమే నమ్మకం తనకు కలిగిందన్నారు. ఈ సదస్సుకు అమెరికా, జర్మనీ, ఇంగ్లండ్, సింగపూరు, ఆస్ట్రేలియా సహా తొమ్మిది దేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, ప్రతినిధులు విచ్చేయడం సంతోషదాయకమన్నారు. ఆ తొమ్మిదిదేశాలూ సదస్సు ప్రాంగణంలో తమ ఉత్పత్తులపై, వాణిజ్య సంబంధాల విస్తరణపై ప్రత్యేకమైన స్టాళ్ల ఏర్పాటు చేయడం సముచితంగా ఉందన్నారు. రాష్ట్రంలో వస్తువుల ఉత్పత్తిపైనే కాకుండా వాటి అమ్మకాలు, ఎగుమతులపై కూడా తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారిస్తుందన్నారు. అంతేకాకుండా ఎగుమతులు పెరిగితే ఇటు రాష్ట్రం, అటు దేశం కూడా అభివృద్ధి చెందగలవని ఆయన చెప్పారు. తమ ప్రభుత్వంపై నమ్మకం ఉంచి అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్న సంస్థలన్నీ వీలైనంత త్వరగా పరిశ్రమలు నెలకొల్పేందుకు అన్ని విధాలా సహకరిస్తామని, మౌలిక సదుపాయాలను యుద్ధ ప్రాతిపదికన సమకూర్చుతామని సదస్సు వేదికగా భరోసా ఇస్తున్నానని స్టాలిన్ చెప్పారు. అనివార్య కారణాల వల్ల సదస్సులో పాల్గొనలేని దేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు ఎప్పుడైనా రాష్ట్రానికి వచ్చి పరిశ్రమలు స్థాపించేందుకు తనతో నేరుగా చర్చించవచ్చన్నారు. ఈ సదస్సు ముగింపు వేడుకల సభలో బ్రిటన్ మంత్రి లార్డ్ తారీక్ అహమ్మద్, మంత్రులు టీఆర్‌బీ రాజా, అన్బరసన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, పారిశ్రామిక శాఖ కార్యదర్శి అరుణ్‌రాయ్, ఎంఎస్‌ఎంఈల శాఖ కార్యదర్శి అర్చనా పట్నాయక్, మహేంద్రా గ్రూపు, టఫే, అదానీ పోర్ట్స్, సెయింట్ గోబైన్, టాటా పవర్, రామ్‌కో, సీఐఐ ఎండీలు, చైర్మన్‌లు, ప్రతినిధులు పాల్గొన్నారు.



సదస్సు ముగింపు వేడుకల్లో విల్లుపురం జిల్లాల్లో ఫెంగ్‌టే సంస్థ నెలకొల్పిన జంతుచర్మాల రహిత పాద రక్షల తయారీ కర్మాగారాన్ని ప్రారంభిస్తున్న సీఎం స్టాలిన్

అదానీ గ్రూపు రూ.42వేల కోట్ల పెట్టుబడి...

అంతర్జాతీయ పెట్టుబడిదారుల సదస్సు రెండోరోజు అదానీగ్రూపు రాష్ట్రంలో పరిశ్రమలు నెలకొల్పేందుకు రూ.42.76వేలకోట్ల పెట్టుబడులుపెట్టేందుకు ఒప్పందాలు కుదుర్చుకుంది. ఆ మేరకు అదానీ గ్రీన్ ఎనర్జీ రూ.24500 కోట్ల పెట్టుబడితో 4వేలమందికి ఉపాధి కల్పించనుంది. అంబూజా సిమెంట్స్ రూ.3500కోట్ల పెట్టుబడితో 5వేలమందికి ఉపాధి కల్పించనుంది. ఇదేవిధంగా అదానీ కొనెక్స్ 1000మందికి ఉపాధి కల్పించేలా రూ.13,200 కోట్ల మేరకు పెట్టుబడులు పెట్టనుంది. అదానీ టోటల్‌గ్యాస్‌అండ్ సీఎన్‌జీ 300 మందికి ఉపాధి కల్పించేలా రూ.1,569 కోట్ల మేరకు పెట్టుబడులతో పరిశ్రమను నెలకొల్పనుంది. ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో ఈ ఒప్పందాలు కుదుర్చుకుంది.

అలంగానల్లూరు జల్లికట్టు విజేతకు కారు

సీఎం తరఫున బహుమతి ● మంత్రి మూర్తి ప్రకటన

వైభవంగా ముహూర్త స్తంభ స్థాపన

చెన్నై, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన అలంగానల్లూరు జల్లికట్టు క్రీడాపోటీల్లో విజేతకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తరఫున కారును బహూకరించనున్నట్లు వాణిజ్య పన్నులు, రిజిస్ట్రేషన్ శాఖల మంత్రి పి.మూర్తి తెలిపారు. అదే విధంగా ఎవరికీ చిక్కకుండా ప్రతిభను ప్రదర్శించే ఎద్దు యజమానికి కూడా కారును బహూకరించనున్నామని చెప్పారు. సంక్రాంతి పండుగ సందర్భంగా అలంగానల్లూరులో జల్లికట్టును ఈనెల 17న ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం నిర్వహించనున్నారు. జల్లికట్టు ఏర్పాట్లను ప్రారంభించే విధంగా సోమవారం ఉదయం అలంగానల్లూరు వాడివాసల్ సమీపంలోని ముత్తాలమ్మన్ ఆలయం ఎదుట ముహూర్త స్తంభ స్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మూర్తితోపాటు శాసనసభ్యుడు వెంకటేశన్, జిల్లా కలెక్టర్ సంగీత, క్రీడా నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ముందుగా ఆలయంలోని అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి ముహూర్త స్తంభాన్ని ధ్వజస్తంభం ఎదుట ఉంచి ప్రత్యేక పూజలు జరిపారు. ఆ తర్వాత జల్లికట్టు పందిరి నిర్మాణానికి ఆ ముహూర్త స్తంభాన్ని నాటారు. ఈ కార్యక్రమంలో డీఎంకే నేతలు బాలసుబ్రమణ్యన్, ధనరాజ్, రఘుపతి, సర్పంచ్ రేణుకేశ్వరి గోవిందరాజ్, ఉప సర్పంచ్ సామినాథన్, నగర పంచాయతీ కార్యనిర్వహణాధికారి జిలాన్ బాను, డీఎస్పీ బాలసుందరం, యూనియన్ కమిషనర్ ప్రేమ్‌రాజన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మూర్తి విలేఖరులతో మాట్లాడుతూ ప్రభుత్వ నియమనిబంధనల ప్రకారం ఎద్దులకు, వాటిని అణచి వేసేందుకు ప్రయత్నించే యువకులకు వైద్యపరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ యేడాది కూడా అలంగానల్లూరు జల్లికట్టులో ప్రతిభాపాటవాలను ప్రదర్శించే క్రీడాకారులకు, ఎద్దులకు బహుమతులు పంపిణీ చేస్తామన్నారు. ఈ జల్లికట్టులో పాల్గొనే ఎద్దుల యజమానులందరికీ కానుకలు ఇవ్వనున్నామని చెప్పారు. విజేతకు ముఖ్యమంత్రి స్టాలిన్ తరఫున కారును, ద్వితీయ స్థానంలో నిలిచిన క్రీడాకారుడికి మంత్రి ఉదయనిధి తరఫున మోటారు బైకును కానుకగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇక ఎద్దులను అణిచే యువకులకు తలా ఓ బంగారు కాసును బహుమానంగా ఇస్తామన్నారు. ఈ పోటీల్లో ఆవుదూడలను, బంగారు నాణేలను, బీరువాలు, మంచాలు సహా గృహోపకరణాలను బహుమతులుగా అందిస్తామన్నారు. ఈ పోటీలలో పాల్గొనే యువకులు ఆన్‌లైన్ ద్వారా పేర్లను నమోదు చేసుకుంటున్నారని మంత్రి మూర్తి చెప్పారు.



ముహూర్త స్తంభాన్ని నాటుతున్న మంత్రి మూర్తి తదితరులు

త్వరలో జల్లికట్టు మైదానం

అలంగానల్లూరు సమీపంలో రూ.44 కోట్లతో నిర్మించిన జల్లికట్టు మైదానాన్ని ఈ నెలాఖరులోపున ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించనున్నారని మంత్రి మూర్తి చెప్పారు. ఈ విషయమై ఒకటి రెండు రోజుల్లో ప్రకటన కూడా జారీ అవుతుందన్నారు.

మహిళా సాధికారిక నిధి పథకంలో మరో 2 లక్షల మంది

పెరంబూర్, జనవరి 8: 'కలైంజర్ మహిళా సాధికారిక నిధి' పథకంలో రాష్ట్రవ్యాప్తంగా 1.13 కోట్ల మంది లబ్ధిదారులకు ప్రతినెలా వారి బ్యాంక్ ఖాతాల్లో రూ.1,000 నగదును జమ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఈ పథకానికి దరఖాస్తు చేసుకొని నిరాకరణకు గురైన వారు మళ్లీ తమను చేర్చాలని కోరుతూ సుమారు 11.85 లక్షల దరఖాస్తులందాయి. ఈ దరఖాస్తులను నేరుగా విచారించిన అధికారులు, ప్రస్తుతం 2 లక్షల మంది అర్హులుగా గుర్తించారు. వీరికి ఈనెల నుంచే నగదు పంపిణీ చేయనున్నారు. కాగా, ఈ పథకంలో అదనంగా లబ్ధిదారులను చేర్చడంతో ఆ సంఖ్య 1.15 కోట్లకు పెరిగింది.

సమాచార దర్శిని

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, జనవరి 8: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా తాంబరం, అంబత్తూరు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని ఈబీ తెలిపింది.

తాంబరం: కోవిలంబాక్కం కవిమణి నగర్, ఎంజీఆర్ నగర్, వినాయకపురం 200 అడుగుల రోడ్డు, నారాయణపురం, వెస్ట్ అన్నానగర్, ఎస్.కొళత్తూరు రోడ్డు, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, సెల్వంనగర్, ఈచ్చంకాడు, మేడవాక్కం మెయిన్ రోడ్డు, చిన్న కోవిలంబాక్కం, రోజ్‌నగర్, భూపతి నగర్, అంబాళనగర్, సిండికేట్ కాలనీ, వడక్కుపట్టు, ఓంశక్తి నగర్, సుశీలనగర్, కలైంజర్ రోడ్డు, పెరియార్ నగర్, ధర్మభూపతి నగర్, తిరువళ్లువర్ వీధి, పొన్నుస్వామి వీధి, పీఎండీనగర్, బెల్ నగర్, అయ్యప్పన్ నగర్, అన్నామలై నగర్, గాంధీనగర్, భజనాలయవీధి, మారియమ్మన్ అలయ వీధి, సదాశివం అవెన్యూ, మరుదు పాండియన్ నగర్, వెళ్లక్కల్, సత్యానగర్, లోకనాథన్ వీధి, కామరాజర్ వీధి, రాజీవ్‌గాంధీ వీధి, ఢిల్లీబాబు నగర్, అన్నై గార్డెన్, ప్రభు నగర్, గణపతి నగర్, ఆదిమూలం నగర్, నన్మంగళం, వడివేల్ నగర్, గోపాల్ నగర్, ఏళుమలై రోడ్డు, అభినత్తం నగర్, విజయలక్ష్మి నగర్, ఇందిరానగర్.

అంబత్తూరు: అయనపాక్కం, ఐసీఎఫ్ కాలనీ, సెల్లియమ్మన్ నగర్, గంగైరోడ్డు, కావేరి వీధి, టీఎన్‌హెచ్‌బీ ఫ్లాట్స్ తిరువేర్కాడు మెయిన్‌రోడ్డు, అత్తిపట్టు, వానగరం, భారతి మేట్టువీధి, దినేష్‌వీధి, రోజావీధి, కుప్పం, కేఎస్‌ఆర్ నగర్, వీజీఎన్ శాంతినగర్, మేల్‌అయనంబాక్కం, శెట్టివీధి, విజయనగర్, పచ్చయప్పన్ నగర్, చెన్నై న్యూ సిటీ, ఈడెన్ అవెన్యూ, కొన్‌రాజ్‌కుప్పం, అగ్రహారం, దేవినగర్, చిన్నకోలడి, జ్యోతినగర్, మూండ్రునగర్, ఎళిల్ నగర్, అన్ననూర్.

జ్వర పీడిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు

పెరంబూర్, జనవరి 8: రాష్ట్రంలో జ్వరాలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామని ఆరోగ్యశాఖ తెలిపింది. వర్షాకాలంలో ప్రబలే జ్వరాలు, అంటు వ్యాధులు వ్యాప్తి అడ్డుకొనేలా చర్యలు చేపట్టిన ప్రభుత్వం గత ఏడాది అక్టోబర్ 29నుంచి డిసెంబర్ 30వతేదీ వరకు ప్రతిశనివారాల్లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు2వేలప్రాంతాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు నిర్వహించింది.ప్రస్తుతం వర్షాకాలం ముగియడంతో ఈ శిబిరాలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈవిషయమై ఆరోగ్యశాఖ డైరెక్టర్ సెల్వవినాయగం మాట్లాడుతూ... వర్షాకాలంలో దోమల ద్వారా ప్రబలే డెంగ్యూ, చికున్ గున్యా, ర్యాట్ ఫీవర్ తదితర వ్యాధుల వ్యాప్తి తక్కువగా ఉందన్నారు. అదే సమయంలో కరోనా, ఇన్ ఫ్లుయేంజా మాత్రం వ్యాపిస్తున్నాయన్నారు. వాటిని నియంత్రించేలా చర్యలు చేపట్టామని తెలిపారు. సంచార వైద్య బృందాలు ఆయా ప్రాంతాలకు వెళ్లి వైద్య పరీక్షలు, చికిత్సలు అందిస్తాయని ఆయన తెలిపారు.

రేపు అప్రెంటీస్‌ల ఎంపిక శిబిరం

ఐసిఎఫ్, జనవరి 8: ఉత్తర చెన్నైలో అప్రెంటీస్‌ల ఎంపికశిబిరం ఈనెల10న జరగనుంది. చెన్నై జిల్లానైపుణ్య శిక్షణ కార్యాలయం, కేంద్రప్రభుత్వం, దక్షిణ మండల నైపుణ్యాభివృద్ధి సంస్థలు సంయుక్తంగా ఐటీఐ చదివిన విద్యార్థులకు అప్రెంటీస్ శిక్షణ ఇవ్వనున్నాయి. ఈనెల 10న బుధవారం ఉదయం 9 గంటలకు స్థానిక ఆర్కేనగర్‌లోని ఉత్తర చెన్నై ఐటీఐ ప్రాంగణంలో జరుగనుంది. వీరికి నెలకు ఉపకారవేతనం రూ.8వేలు అందిస్తారు. వీరితో పాటు పది, ప్లస్‌టూ ఉత్తీర్ణులైన వారు కూడా అప్రెంటీస్‌లుగా చేరవచ్చు. వివరాలకు www.apprenticeshipindia.gov.inలో సంప్రదించవచ్చు.

త్వరలో అడయార్, అజంతా ఫ్లైవోవర్ల కూల్చివేత

ఐసిఎఫ్, జనవరి 8: రెండో విడత మెట్రో పథకం కోసం రాయపేట అజంతా, అడయార్ ఫ్లైవోవర్లను ఈనెలాఖరులో కూల్చివేయనున్నట్లు సీఎంఆర్ఎల్ అధికారులు తెలిపారు. నగరంలో రెండోవిడత మెట్రోరైల్ పనులు రూ.63,426 కోట్లతో 118.9 కిలోమీటర్లమేర మూడు మార్గాల్లో జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పనులకు అంతరాయంగాఉన్న అడయార్ ఫ్లైవోవర్, రాధాకృష్ణన్‌రోడ్డు రాయపేటజంక్షన్‌లోవున్న అజంతా ఫ్లైవోవర్‌ను కూల్చివేసి, మెట్రో మార్గాలు పూర్తయిన అనంతరం మళ్లీ నిర్మిస్తామని అధికారులు తెలిపారు.

వండలూరు జూకు చిరుత



పెరంబూర్, జనవరి 8: గూడలూరులో పట్టుబడిన చిరుతను వండలూరు జూకు తరలించారు. నీలగిరి జిల్లా గూడలూరు సమీపంలోని తేయాకు తోటల్లో కొంతకాలంగా సంచరిస్తున్న చిరుత, నలుగురిపై దాడి చేసింది. ఈ ఘటనల్లో మూడేళ్ల చిన్నారితో పాటు మహిళ మృతి చెందింది. దీనిపై అటవీ శాఖ అధికారులు ఆదివారం తోటలో దాగిన దాగిన చిరుతను మత్తు ఇంజక్షన్ వేసి బంధించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో వండలూరు జూకు తరలించారు.

స్టెరిలైట్ కర్మాగారం ప్రారంభిస్తే 10 వేలమందికి ఉపాధి

పెరంబూర్, జనవరి 8: తూత్తుకుడి స్టెరిలైట్ కర్మాగారం ప్రారంభిస్తే పది వేలమంది ఉపాధి లభిస్తుందని సుప్రీంకోర్టుకు కర్మాగారం మద్దతుదారులు తెలిపారు. స్టెరిలైట్ కర్మాగారం పర్యావరణానికి హాని కలిగిస్తోందంటూ రాష్ట్రప్రభుత్వం ఆ కర్మాగారం మూసివేస్తూ ఉత్తర్వులు జారీచేసినవిషయం తెలిసిందే.ఈనిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వేదాంతసంస్థ దాఖలుచేసిన పిటిషన్ మద్రాస్ హైకోర్టు కొట్టి వేసింది. ఈ తీర్పును వ్యతిరేకిస్తూ వేదాంత సుప్రీంకోర్టు దాఖలు చేసిన అప్పీలు పిటిషన్ ప్రస్తుతం విచారణలో ఉంది. ఈ నేపథ్యంలో, కర్మాగారం మూసివేతతో వేలాదిమంది ఉపాధి కోల్పోయారని, తెరిచేలా ఉత్తర్వులు జారీ చేయాలని కర్మాగారం మద్దతుదారుల తరపున మరో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించగా... పిటిషన్‌దారుల తరపున హాజరైన న్యాయవాది వికాస్‌సింగ్, ఈ పిటిషన్ సత్వరం విచారించాలని కోరారు. అందుకు ధర్మాసనం అభ్యంతరం తెలుపుతూ, వేదాంత దాఖలుచేసిన పిటిషన్ ఫిబ్రవరిలో విచారిస్తామని పేర్కొన్ననేపథ్యంలో, అత్యవసరంగా విచారించాలని కోరుతున్నారని,ఈనెలలో ఈకేసును విచారణపై పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

గ్రామ నిర్వాహక అధికారుల ఆందోళన

వేలూరు, జనవరి 8: స్థానిక కాట్పాడి తహసీల్దార్ కార్యాలయం సమీపంలో తమిళనాడు గ్రామ నిర్వాహక అధికారుల సంఘం సోమవారం ఆందోళన నిర్వహించింది. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన గ్రాఫ్‌సర్వే అమలు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని నినాదాలు చేశారు. సంఘ అధ్యక్షుడు అన్బరసన్, సంఘ కోటఆర్గనైజర్ జ్యోతీశ్వరన్, జిల్లా అధ్యక్షుడు వెంకటేశన్, సెక్రటరీ శరవణన్, ఉపాధ్యాక్షుడు నివేదకుమారి, ఉప సెక్రటరీ సురేష్‌బాబు, కోశాధికారి ఇళంగోవన్ సహా పలువురు పాల్గొన్నారు.

చిదంబరంలో కుండపోత

ఎన్ఎల్‌సీలో ఆగిన తవ్వకాలు



చిదంబరంలోని ఓ వీధిలో వరదలా ప్రవహిస్తున్న వర్షపునీరు

చెన్నై, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా చిదంబరంలో ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం వేకువజాము వరకు కుండపోతగా వర్షం కురిసింది. ఆ నగరంలో 22 సెం.మీల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ వర్షం కారణంగా నైవేలిలోని లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్ఎల్‌సీ)లో నేలబొగ్గు తవ్వకాల పనులను నిలిపివేశారు. కడలూరు, నెల్లికుప్పం, కాట్టుమన్నార్‌కోవిల్, సేత్తియోతోప్పు, భువనగిరి, పరంగిపేటల్లో చెదురుముదురుగా వర్షాలు కురిశాయి. వర్షానికి కోతకు సిద్ధంగా ఉన్న వరిపంటలు నీటమునిగాయి. ఎన్నెల్సీ సొరంగాలలో నీరు ప్రవహించడంతో బొగ్గు తవ్వకాలను నిలిపివేశారు. అదే సమయంలో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. పన్రుట్టి, తేరాపట్టి, పుదుపేట, కాటాంపులియూరు, అన్నైగ్రామం, ముత్తాండికుప్ప, గంధారకోట పరిసర ప్రాంతాల్లో ఆదివారం రాత్రి నుంచి సోమవారం వేకువజాము రెండు గంటల వరకూ మోస్తరు వర్షాలు కురిశాయి.

పుదుచ్చేరిలో స్తంభించిన జనజీవనం

జలదిగ్బంధంలో 500ల నివాసగృహాలు





జవహర్‌నగర్‌లో జలదిగ్బంధంలో చిక్కుకున్న ఇల్లు - పుదుచ్చేరి పావానగర్‌లో జలమయమైన రహదారి

పుదుచ్చేరి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరిలో ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం వేకువజాము వరకు కురిసిన కుండపోత వర్షాలకు జనజీవనం స్తంభించింది. రహదారులలో వర్షపు నీరు వరదలా ప్రవహించడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. పల్లపు ప్రాంతాల్లో సుమారు 500 నివాసగృహాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. భారీ వర్షాల కారణంగా ఆ రాష్ట్రంలో పాఠశాలలు, కళాశాలలకు ముఖ్యమంత్రి ఎన్.రంగసామి సెలవు ప్రకటించారు. పావానర్ నగర్, భూమియాన్‌పేట, జవహర్‌నగర్, రెయిన్‌బో నగర్, వెంకటానగర్ తదితర ప్రాంతాలు దీవులుగా మారటంతో ఆ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పుదుచ్చేరి సమీప ప్రాంతాలలో కూడా మోకాలి లోతు వర్షపునీరు మురుగునీటితో కలిసి ప్రవహించింది. 12 సెం.మీల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

28నుంచి సీఎం స్టాలిన్ విదేశీ పర్యటన

ప్యారీస్, జనవరి 8: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈనెల 28వ తేదీ నుంచి మూడు దేశాల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో ఆయన తొలుత స్పెయిన్‌కు వెళతారు. అక్కడినుంచి ఆస్ట్రేలియా, ఆ తర్వాత అమెరికాకు వెళతారని సోమవారం సాయంత్రం ముఖ్యమంత్రి కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. కాగా, నగరంలో ఆది, సోమవారాల్లో ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సును విజయవంతంగా పూర్తి చేసిన తర్వాత సీఎం మళ్లీ మూడు దేశాల్లో రెండు వారాలు పర్యటించనున్నట్లు సీఎంవో పేర్కొంది. ఈ పర్యటనలో పలువురు పారిశ్రామికవేత్తలతో కలుసుకుని, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని కోరనున్నారు. సీఎం స్టాలిన్ వెంట పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు కూడా వెళ్ళే అవకాశం ఉంది.

ఎస్సీ, ఎస్టీలకు నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ

ఐసిఎఫ్, జనవరి 8: థాడ్కో ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగావకాశంతో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వనున్నట్లు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్దార్థ్ జాక్డే తెలిపారు. మెకానికల్, ప్రొడక్షన్ టెక్నాలజీ, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ డిప్లొమా, ఇంజనీరింగ్ ముగించిన ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన 18 నుంచి 26 ఏళ్లలోపు వున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆరు నెలల శిక్షణ కాలంలో ఉచిత భోజనం, బస సౌకర్యాలు కల్పిస్తారు. శిక్షణ పూర్తిచేసిన వారికి జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ సర్టిఫికెట్లు అందజేసి, ప్రభుత్వ సంస్థలు, కర్మాగారాల్లో ఉద్యోగావకాశాలు కల్పించనున్నారు. ఔత్సాహికులు థాడ్కో వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, శిక్షణ రుసుము థాడ్కో చెల్లిస్తుందని కలెక్టర్ తెలిపారు.

సంక్రాంతికి మూడు ప్రత్యేక రైళ్లు

ఐసిఎఫ్, జనవరి 8: సంక్రాంతి పండుగ సందర్భంగా చెన్నై నుంచి అన్‌రిజర్వుడు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. చెన్నై ఎగ్మూర్ - తిరునల్వేలి ఈనెల 14, 16 తేదీలు, తిరునల్వేలి-చెన్నై ఎగ్మూర్‌కు 15, 17 తేదీలు, తాంబరం - తిరునల్వేలికి 11, 13, 16 తేదీలు, కోయంబత్తూర్ - చెన్నై ఎగ్మూర్‌కు ఈనెల 16, 17 తేదీల్లో ఈ ప్రత్యేక రైళ్లు నడువనున్నాయని అధికారులు తెలిపారు.

9,10 తేదీల్లో విద్యార్థులకు కవిత, వక్తృత్వ పోటీలు

పెరంబూర్, జనవరి 8: తమిళ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో యేటా అన్నిజిల్లాల్లో పాఠశాల, కళాశాల విద్యార్థులకు కవితలు, కార్టూన్లు, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నారు. చెన్నై జిల్లా పరిధిలో ఈనెల 9వ తేది స్థానిక ఎగ్మూర్‌లోని రాజధాని మహిళా మహోన్నత పాఠశాల, కళాశాల విద్యార్థులకు 10వ తేది చెన్నై రాజధాని కళాశాలలో ఈ పోటీలు నిర్వహించనున్నారు. అలాగే, జిల్లాల్లో మొదటి, రెండు, మూడవ స్థానాల్లో నిలిచిన పాఠశాల విద్యార్థులకు ఈనెల 23న, కళాశాల విద్యార్థులకు 24న నగరంలో నిర్వహించనున్నారు. జిల్లా స్థాయి విజేతలకు రూ.10 వేలు, రూ.7 వేలు, 5 వేలు, రాష్ట్ర స్థాయి విజేతలకు రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు నగదు బహుమతులు అందజేయనున్నట్లు తమిళ అభివృద్ధి శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

కంచి మఠంలో త్రిదశ సంస్మరణ



సంగీత కళాకారుల పంచరత్న

ప్యారీస్, జనవరి 8: కంచిమఠంలో దివంగత పరమాచార్య త్రిదశ సంస్మరణ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కంచి మఠంలో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులతో పరమాచార్యగా పూజలు అందుకున్న చంద్రశేఖరేంద్ర సరస్వతిస్వామి ముక్తి పొంది 30 యేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయన నిలువెత్తు చిత్రపటాన్ని పూలతో అలంకరించారు. మఠం ప్రాంగణంలో ఉన్న సమాధివద్ద ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆ తర్వాత ఉదయం 7 గంటలకు తిరువయ్యారు క్షేత్రంలో నిర్వహించే తరహాలో పంచరత్న సంగీత కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు వంద మంది సంగీత కళాకారులు భక్తిగీతాలు ఆలపించి నివాళి అర్పించారు.

బ్యాంకు ఖాతాల్లో పొంగల్ నగదు జమ

● హైకోర్టు సూచన

ప్యారీస్, జనవరి 8: కలైంజర్ మహిళా సాధికారిక నగదు పంపిణీ పథకం కింద అర్హులై మహిళలకు ఇస్తున్న రూ.1000 నగదు తరహాలోనే సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రభుత్వం ఇచ్చే రూ.1000 నగదు బహుమతిని కూడా బ్యాంకు ఖాతాల్లో జమ చేసే అంశాన్ని పరిశీలించాలని మద్రాసు హైకోర్టు మదురై బెంచ్ సర్కారుకు సూచన చేసింది. పొంగల్ కానుకగా అర్హులైన రేషన్‌కార్డుదారులకు పొంగల్ సరకులతో పాటు రూ.వెయ్యి నగదును ప్రభుత్వం అందజేస్తుంది. ఈ మొత్తాన్ని ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు స్థానిక రేషన్ షాపుల్లో నగదు రూపంలో అందజేయనుంది. అయితే, ఈ నగదును కూడా బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని కోరుతూ హైకోర్టు మదురై బెంచ్‌లో ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. దీన్ని విచారణకు స్వీకరించిన కోర్టు ఈ నగదుతో సహా చెరకు రైతులకు కూడా చెల్లించే కొనుగోలు ధర నగదును బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసేలా పరిశీలించాలని సూచించింది.

18న కావేరి నిర్వాహక మండలి సమావేశం

పెరంబూర్, జనవరి 8: కావేరి నిర్వాహక మండలి సమావేశం ఈనెల 18వ తేది జరగనుంది. ఈ సమావేశంలో పాల్గొనాలని తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలకు ఆహ్వానాలు పంపారు. గత నెల 19వ తేది జరిగిన సమావేశంలో డిసెంబరు నెలకు 3,128 ఘనపుటడుగుల కావేరి జలాలను తమిళనాడుకు కర్ణాటక విడుదల చేయాలని సిఫారసు చేశారు. అలాగే, జనవరికి సంబంధించి 1వ తేది నుంచి 1,003 ఘనపుటడుగులు విడుదల చేయాలని కూడా సిఫారసు చేశారు. రాష్ట్రానికి విడుదల చేసిన కావేరి జలాలు, కర్ణాటక డ్యాంలలో నీటి వివరాలను చర్చించనున్నారు.

ఎస్ఆర్ఎం గ్లోబల్ హాస్పిటల్స్‌లో అత్యవసరచికిత్సలకు ప్రత్యేక వైద్యబృందం



చెన్నై, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా కాట్టాన్‌కొళత్తూరులోని ఎస్ఆర్ఎం గ్లోబల్ హాస్పిటల్స్‌లో అత్యవసర చికిత్సల కోసం ప్రత్యేక వైద్యబృందాన్ని నియమించినట్లు ఎస్ఆర్ఎం గ్రూప్ ఆఫ్‌కంపెనీస్ అధ్యక్షుడు డాక్టర్ పి.సత్యనారాయణన్ తెలిపారు. ఈ ప్రత్యేక వైద్య బృందంలో నలుగురు కార్డియాలజిస్టులు, ఐదుగురు గ్యాస్ట్రోఎంట్రాలజిస్టులు, వివిధ రకాల చికిత్సలందించే 15 మంది వైద్యులు ఉంటారని ఆయన వివరించారు. రోగి సంరక్షణ, అంతర్జాతీయ స్థాయి చికిత్స, త్వరితగతిన నివారణ అనే మూడు ప్రధానమైన లక్ష్యాలతో ఈ బృందం పనిచేస్తుందన్నారు. 24 గంటలపాటు ఈ వైద్యబృందం అందుబాటులో ఉంటుందన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



ఎగ్జిబిషన్ పరిశీలిస్తున్న కలెక్టర్ కుమరవేల్ పాండ్యన్

వేలూరు, జనవరి 8: ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమరవేల్ పాండ్యన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని 5వ అంతస్తులో జిల్లా సమాచార శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలతో కూడిన ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. దాన్ని సోమవారం కలెక్టర్ కుమరవేల్ పాండ్యన్ పరిశీలించారు. కలెక్టర్‌వెంట జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, రెవెన్యూ తహసీల్దార్ కవితసహా పలుశాఖల అధికారులున్నారు.

కరాటే పోటీల విజేతలకు అభినందన



జాతీయస్థాయి పోటీల విజేతలతో నిర్వాహకులు

వేలూరు, జనవరి 8: నగరంలో నిర్వహించిన 47వ జాతీయస్థాయి కరాటే పోటీల్లో తిరువణ్ణామలై జిల్లా చెంగంలోని జపాన్ షిటోరియా కరాటే శిక్షణ కేంద్రానికి చెందిన విద్యార్థులు ఛాంపియన్‌షిప్ గెలుచుకున్నారు. ఈ పోటీల్లో ఈ కేంద్రానికి చెందిన ఐదుగురు మొదటి బహుమతి, ఒకరు రెండో బహుమతి, నలుగురు మూడో బహుమతులతోపాటు ముగ్గురు బ్లాక్‌బెల్ట్ పొందారు.

ఆరేళ్ళ చిన్నారి తల్లిదండ్రులకు అప్పగింత

అడయార్, జనవరి 8: స్థానిక అయనావరంలోని బస్టాండు సమీపంలో తప్పిపోయిన ఆరేళ్ళ చిన్నారిని గుర్తించి, ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు. అయనావరం బస్టాండ సమీపంలో ఓ చిన్నారి తిరుగుతున్నట్టు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఇన్‌స్పెక్టర్ భరణినాథన్ సిబ్బందితో బస్టాండు వద్దకువెళ్లి చిన్నారిని దగ్గరకు తీసుకున్నారు. ఆతర్వాత ఆచిన్నారికి తినుబండరాలు కొనిచ్చి.. తల్లిదండ్రుల వివరాలు సేకరించారు. ఆచిన్నారి వివరాలను పలు వాట్సాప్‌గ్రూపుల్లో షేర్ చేశారు. దీంతో ఆచిన్నారి తల్లిదండ్రులు అయనావరం పొన్‌వేల్‌పురానికిచెందిన రహ్మతుల్లా, అజియా దంపతులు వెంటనే పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఇంటి నుంచి తప్పిపోయిన తమ కుమార్తె వివరాలు, ఆనవాళ్ళు చెప్పారు. ఆ తర్వాత ఆ చిన్నారి కూడా తమ తల్లిదండ్రుల వద్దకు వెళ్లడంతో బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు.

అటవీ శాఖ కార్యాలయ వస్తువుల జప్తు



పెరంబూర్, జనవరి 8: పుదుకోట జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో జప్తు చేపట్టడం కలకలం రేపింది. అటవీ శాఖకు చెందిన వాహనం ఢీకొనడంతో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి నష్టపరిహారం అందజేయని నేపథ్యంలో, ఈ కార్యాలయంలోని వస్తువులను సోమవారం కోర్టు సిబ్బంది స్వాధీనం చేసుకొని కోర్టులో అప్పగించారు. 2014లో అటవీ ప్రాంతంలో అటవీ శాఖ వాహనం ఢీకొని ఇద్దరు మృతిచెందారు. ఈ కేసులో మృతుల కుటుంబాలకు నష్టపరిహారం అందించాలనే కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన నేపథ్యంలో, కార్యాలయంలోని వస్తువులు జప్తు చేయాలని కోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

వానరాల బారి నుంచి రక్షించండి

వేలూరు, జనవరి 8: స్థానిక కాట్పాడి సమీపం సేర్కాడులో వానరాల బెడద అధికంగా ఉందని, వాటిని బంధించి అడవుల్లో వదిలి పెట్టాలని కోరుతూ గ్రామస్తులు కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. అలాగే, ఇటీవల కురిసిన వర్షాలతో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని పేర్కొన్నారు.



జగన్నాథన్‌తో స్థానిక సంస్థల ఆడిటింగ్ విభాగం మాజీ ఉద్యోగులు

స్థానిక సంస్థలకు అధిక నిధులు కేటాయించాలి

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జగన్నాథన్

ప్యారీస్, జనవరి 8: స్థానిక సంస్థలలో అభివృద్ధి పనులు చేపట్టే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం అధికంగా నిధులు కేటాయించాలని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డి.జగన్నాథన్ డిమాండ్ చేశారు. స్థానిక మైలాపూరులోని ఉడ్‌లాండ్స్ హోటల్‌లో సోమవారం ఉదయం స్థానిక సంస్థల ఆడిటింగ్ విభాగం మాజీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రజతోత్సవంలో జగన్నాథన్ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎస్.కరుత్తయ్య పాండ్యన్, డాక్టర్ దేవపార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

వరద సాయంపై నోరు మెదపని కేంద్రం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ విమర్శ

పెరంబూర్, జనవరి 8: తుఫాను, భారీ వర్షాలతో రాష్ట్రంలో తీవ్రంగా నష్టపోయిన జిల్లాలను ఆదుకునేలా నిధులు అందించాల్సిన కేంద్రప్రభుత్వం మౌనంగా ఉండడం సరికాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్ విమర్శించారు. దిండుగల్‌లో గ్రామీణ అభివృద్ధి శాఖ ఉద్యోగుల సంఘ మహానాడు ఆదివారం జరిగింది. ఈ మహానాడులో పాల్గొన్న అనంతరం ముత్తరసన్ మీడియాతో మాట్లాడుతూ... ప్రపంచ బ్యాంకు నుంచి రుణాలు తీసుకునేందుకు రాష్ట్రప్రభుత్వానికి అనుమతులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. అదే సమయంలో తిరుచ్చికి వచ్చిన ప్రధానికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వరద నివారణ సాయం అందించాలని కోరినా, ఆయన స్పందించక పోవడం శోచనీయమన్నారు. రాష్ట్రం ఆర్థిక లోటు ఎదుర్కొంటున్నా, పొంగల్ సందర్భంగా రేషన్ కార్డుదారులకు వెయ్యి రూపాయలు నగదు చెల్లించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. రాష్ట్రాలకు నిధుల కేటాయింపు సహా పలు విషయాలపై కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ అబద్ధాలు చెబుతున్నారని, ఆమెలా అబద్ధాలు చెప్పేవారు ప్రపంచంలో మరెవ్వరూ ఉండరని ముత్తరసన్ ఎద్దేవా చేశారు.

డీఎంకేకు పెరిగిన ప్రజాదరణ: ఎండీఎంకే అధినేత వైగో

పెరంబుర్ జనవరి 8: ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే పాలనకు అన్ని వర్గాల ప్రజల నుంచి ఆదరణ పెరిగిందని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో తెలిపారు. తూత్తుకుడి జిల్లా కోవిల్‌పట్టిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ప్రపంచంలోనే తమిళనాడును పారిశ్రామికంగా అభివృద్ధి చేసేలా సీఎం ఎంకే స్టాలిన్ నిర్వహిస్తున్న ప్రపంచ పెట్టుబడిదారుల మహానాడుకు భారీ స్పందన వచ్చిందన్నారు. మరోవైపు రాష్ట్రంలో వ్యవసాయాన్ని అభివృద్ధి చేసేలా పలు పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి అధికంగా నిధులు అందించామని పేర్కొన్న కేంద్రం మంత్రి నిర్మలా సీతారామన్‌కు రాష్ట్రమంత్రి తంగం తెన్నరసు సరైన సమాధానం చెప్పారన్నారు. రాష్ట్రం నుంచి ఒక రూపాయి కేంద్రం తీసుకుంటూ పది పైసలు మాత్రమే ఇస్తోందన్నారు. దేశంలో చట్టాలను కేంద్రప్రభుత్వం తనకు అనుకూలంగా మార్చుకుంటోందని విమర్శించారు. రవాణా కార్మికులు చేపట్టిన సమ్మెను ప్రభుత్వం చర్చల ద్వారా పరిష్కరిస్తుందనే నమ్మకం ఉందన్నారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు: నామ్ తమిళర్ కట్చి నేత అరెస్టు

పెరంబూర్, జనవరి 8: ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నామ్ తమిళర్ కట్చి నాయకుడిని చెన్నై పోలీసులు ఆదివారం రాత్రి అరెస్టు చేశారు. ధర్మపురి జిల్లా కోవిల్‌పట్టి మనిపూర్‌కు చెందిన కాళీ అలియాస్ కాళీయప్పన్ తన ఎక్స్ ఖాతాలో డీఎంకే నేతలు, పాలనపై వ్యాఖ్యలు పోస్ట్ చేస్తుంటారు ఈ నేపథ్యంలో, తూత్తుకుడి తుపాకీ కాల్పుల ఘటనలోని నిందితులపై చర్యలు చేపట్టక పోవడమే కాకుండా నిందితులుగా ఉన్న పోలీసు అధికారులకు పదోన్నతులు కల్పించారంటూ ఒక కార్టూన్ వేసి అందులో ముఖ్యమంత్రి పైఅనుచిత వ్యాఖ్యలు పోస్ట్ చేశాడు. ఈ వ్యవహారంపై చెన్నై సైబర్ క్రైం పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసి కాళీయప్పను అరెస్టు చేసి చెన్నైకి తీసుకొచ్చారు. వెప్పేరిలోని నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో విచారిస్తున్నారు.

విజయ్ వద్ద రాజకీయాలు ప్రస్తావించలేదు: కనిమొళి

పెరంబూర్, జనవరి 8: భారీ వర్షాల కారణంగా దక్షిణాది జిల్లాలైన తిరునెల్వేలి, తూత్తుకుడి సహా నాలుగు జిల్లాల్లో పెను నష్టం సంభవించడంతో తన జన్మదిన వేడుకలను డీఎంకే ఎంపీ కనిమొళి రద్దు చేసుకున్నారు. కానీ ఆమెకు పలు పార్టీల నేతలు, పార్టీ నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ క్రమంలో నటుడు విజయ్ కూడా సెల్ ఫోన్ ద్వారా ఎంపీ కనిమొళికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ విషయమై కనిమొళి స్పందిస్తూ... ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా విజయ్ సెల్‌ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారని, ఆ సమయంలో తాము రాజకీయాల గురించి ప్రస్తావించలేదని తెలిపారు. రాష్ట్రానికి అదనపు వరద సాయం అందించాలని అఖిలపక్షం కేంద్రమంత్రి అమిత్ షా ను కలిసేందుకు సమయం కోరామని, ఇంకా కేటాయించలేదని కనిమొళి తెలిపారు.

రాజీవ్‌గాంధీ ప్రభుత్వాసుపత్రిలో విదేశీయులకు చికిత్స



జర్మనీ దేశస్థుడికి చికిత్స అందిస్తున్న డాక్టర్ తేరనిరాజన్

పెరంబూర్, జనవరి 8: చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్ సమీపంలోని రాజీవ్ గాంధీ ప్రభుత్వ ఆసుపత్రిలో గత ఏడాది 73 మంది విదేశీయులకు వైద్య చికిత్సలు అందించారు. చెన్నైకి తలమానికంగా ఉన్న రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆసుపత్రిలో 25 శాఖలుండగా, మొత్తం 3,150 పడకల సామర్థ్యం కలిగి ఉంది. ప్రతి శాఖలోనూ నిపుణులైన వైద్య బృందాలు, అధునాతన పరికరాలతో మెరుగైన వైద్యం అందిస్తుండడంతో, ఈ ఆసుపత్రికి దేశంలోని పలు రాష్ట్రాల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా వైద్య చికిత్సల కోసం రోగులు వస్తున్నారు. అలా రాష్ట్రంలోని ఓ ప్రభుత్వాసుపత్రికి విదేశీయులు అధికంగా వైద్య చికిత్సల కోసం వచ్చిన ఏడాదిగా 2023 నిలిచింది. గత ఏడాది మలేసియా, బంగ్లాదేశ్, స్విట్జర్లాండ్, సూడాన్, ఇథియోపియా, జర్మనీ, శ్రీలంక, నేపాల్ దేశాలకు చెందిన రోగులు చికిత్సల కోసం వచ్చారు. ఈ విషయమై ఆసుపత్రి డీన్ ఎ.తేరనిరాజన్ మాట్లాడుతూ... గత ఏడాది బంగ్లాదేశ్ నుంచి 40 మంది వైద్యచికిత్సల నిమిత్తం ఆసుపత్రికి వచ్చారన్నారు. అలాగే దక్షిణాఫ్రికాకు చెందిన తొమ్మిదిమంది, నైజీరియాకు చెందిన ఏడుగురు, ఇథియోపియాకి చెందిన ఐదుగురు ఎల్లో ఫీవర్‌తో బాధపడుతూ వైద్య చికిత్సల కోసం తమ ఆసుపత్రి వచ్చారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పశ్చిమ బెంగాల్ సహా పలు రాష్ట్రాల నుంచి కూడా రోగులు ఆసుపత్రికి వస్తున్నారని తెలిపారు. ఆ ప్రకారం గత ఏడాది 2720 మంది ఇన్ పేషెంట్లుగా వచ్చి వైద్య చికిత్సలు పొందారని తెలిపారు. ఆసుపత్రిలో ముఖ్యమంత్రి వైద్య బీమా పథకం కింద రాష్ట్రానికి చెందిన వారికి ఉచితంగా వైద్య సేవలు అందిస్తుండగా, పొరుగు రాష్ట్రాలు, విదేశీయులకు ఫీజులు వసూలు చేస్తున్నామన్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి ఎక్కువ మంది పేదలు వస్తుండడంతో వారి కూడా ముఖ్యమంత్రి వైద్య బీమా కింద ఉచిత చికిత్సలు అందించాలని పలువురు కోరుతున్నారని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తేరనిరాజన్ తెలిపారు.

ఎన్పీఎస్‌ను రద్దు చేయాలి

ఎస్ఆర్ఎంయూ నేత కన్నయ్య డిమాండ్



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న కన్నయ్య

ప్యారీస్, జనవరి 8 : రైల్వే శాఖలో కార్మికులకు నష్టం కలిగించే విధంగా 2004కు ముందు ప్రవేశపెట్టిన నేషనల్ పెన్షన్ స్కీం (ఎన్పీఎస్) రద్దు చేయాలని సదరన్ రైల్వే మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.కన్నయ్య డిమాండ్ చేశారు. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఎస్ఆర్ఎంయూ, ఏఐఆర్ఎఫ్‌ల రైల్వే కార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ దీక్ష ఉదయం 9నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కన్నయ్య మాట్లాడుతూ... రైల్వే కార్మికులకు కనీస వేతనంగా రూ.32,500 చెల్లించాలని, అర్హులైన రైల్వే ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలని, యార్డు, డిపోల్లో పనిగంటల సమయాన్ని మార్పు చేయాలని, కార్మికులకు కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్పీఎస్ వల్ల దేశవ్యాప్తంగా రైల్వే కార్మికులు కలిగే నష్టం గురించి కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీకి సభ్యుడిగా తాను మూడుసార్లు జరిగిన సమావేశాల్లో పాల్గొని ప్రస్తావించానని, అయితే ఈ సమస్య పరిష్కారానికి ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. అందువల్ల సోమవారం నుంచి ఈ నెల 11 వరకు నాలుగు రోజులపాటు వరుసగా రైల్వే కార్మిక సంఘాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ సంస్థల కార్మికుల సంఘాలు నిరాహార దీక్షలలో పాల్గొంటాయని తెలిపారు. అప్పటికీ తమ సమస్యలను కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే దేశవ్యాప్తంగా సమ్మె చేపట్టనున్నట్లు కన్నయ్య హెచ్చరించారు.

ఆందోళనలోనే మృతి చెందిన సీపీఐ నేత



భారతి (ఫైల్ ఫొటో)

పెరంబూర్, జనవరి 8: సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో పాల్గొన్న ఆ పార్టీ నగర కార్యదర్శి భారతి మృతిచెందడం విషాదం నింపింది. వర్షబాధిత జిల్లాలను ప్రకృతి విపత్తు బాధిత ప్రాంతాలుగా ప్రకటించాలి, రాష్ట్రప్రభుత్వం కోరిన రూ.21,692 కోట్ల వరద నివారణ నిధులకే కేంద్ర ప్రభుత్వం సత్వరం అందించాలని కోరుతూ సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు జరిగాయి. ధర్మపురి జిల్లా పెన్నాగరం బస్టాండ్ నుంచి 30 మంది సీపీఐ కార్యకర్తలు ఏడీఎస్పీ కార్యాలయం సమీపంలోని ఇండియన్ బ్యాంక్ ముందు ఆందోళన చేపట్టారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని కార్యకర్తలు నినాదాలు చేస్తున్న సమయంలో, పార్టీ నగర కార్యదర్శి భారతి హఠాత్తుగా కుప్పకూలాడు. కార్యకర్తలు వెంటనే అతన్ని పెన్నాగరంలోని ప్రభుత్వ జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్సలు ఫలించక భారతి మృతిచెందాడు. ఆయన మృతికి పలు పార్టీల నేతలు సంతాపం తెలిపారు.



హిందీ నేర్చుకోవద్దని ఎవరూ చెప్పలేదు

● విజయ్ సేతుపతి

రాష్ట్రంలో హిందీని నేర్చుకోవద్దని ఎవరూ చెప్ప లేదని, బలవంతంగా రుద్దవద్దని మాత్రమే అంటున్నారని నటుడు 'మక్కల్ సెల్వన్' విజయ్ సేతుపతి అన్నారు. ఆయన హీరోగా నటించిన 'మెర్రీ క్రిస్మస్' చిత్రం ప్రమోషన్‌లో భాగంగా చెన్నైలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ... 'నాకు కొంతమేర మాత్రమే హిందీలో మాట్లాడం తెలుసు. ఐదు హిందీ చిత్రాల్లో నటించా. తమిళనాడులో హిందీని నేర్చుకోవద్దని ఎవరూ చెప్పడం లేదు. బలవంతంగా రుద్దవద్దని మాత్రమే చెబుతున్నారు. ఇక్కడ అనేక మంది హిందీని అభ్యసిస్తున్నారు. వీరిపై ఎవరి ఒత్తిడి లేదు. ఈ విషయం గురించి మంత్రి పళనివేల్ త్యాగరాజన్ గతంలో వివరించారు. ఇక్కడ ఈ ప్రశ్న అసందర్భం. ఓటీటీలు అందుబాటులోకి వచ్చిన తర్వాత భాషా సరిహద్దులను అభిమానులు చూడటం లేదు. నా కుమారుడు సూర్య హీరోగా పరిచయమవుతూ నటిస్తున్న తొలి చిత్రం 'ఫీనిక్స్'. మా గురించి బయట చెప్పుకోవద్దని మేం నిర్ణయం తీసుకున్నాం. అందుకే నా కుమారుడి చిత్ర ప్రారంభోత్సవ పూజకు వెళ్లలేదు' అని విజయ్ సేతపతి పేర్కొన్నారు.

రజనీ - మారి సెల్వరాజ్ కాంబోలో కొత్త చిత్రం!

సూపర్‌స్టార్ రజనీకాంత్ - డైరెక్టర్ మారి సెల్వరాజ్ కాంబినేషన్‌లో ఒక చిత్రం రూపుదిద్దుకోనున్నట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ప్రస్తుతం రజనీకాంత్ - టీజే జ్ఞానవేల్ కాంబినేషన్‌లో 'వేట్టైకారన్' చిత్రం రూపుదిద్దుకుంటోంది. ఆ తర్వాత యంగ్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ సూపర్‌స్టార్‌ను డైరెక్ట్ చేయనున్నారు. ఇది రజనీ నటించే 171వ చిత్రం. ఈ రెండు చిత్రాల తర్వాత రజనీకాంత్ తన 172వ చిత్రంలో నటించనున్నారు. ఈ చిత్రానికి మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించనున్నట్టు ప్రచారం సాగుతోంది. సామాజిక అంశాలతో చిత్రాలను తెరకెక్కించే మారి సెల్వరాజ్... రజనీకాంత్‌ను ఎలా డైరెక్ట్ చేస్తారన్న ఆసక్తి అభిమానులు నెలకొంది. అలాగే, ఈ చిత్రాన్ని నిర్మించే నిర్మాణ సంస్థ, అందులో నటించే నటీనటుల ఎవరన్నది తెలియాల్సి ఉంది.


రజనీకాంత్ - మారి సెల్వరాజ్

కెప్టెన్‌కు కేంద్ర మంత్రి గోయల్ నివాళి

ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందిన డీఎండీకే అధ్యక్షుడు, సీనియర్ నటుడు కెప్టెన్ విజయకాంత్‌కు కేంద్రమంత్రి పీయూష్ గోయల్ సోమవారం నివాళులు అర్పించారు. సాలిగ్రామంలోని కెప్టెన్ నివాసానికి వెళ్లి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆ సమయంలో కెప్టెన్ సతీమణి, డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత, కోశాధికారి సుధీష్, విజయకాంత్ కుమారులు షణ్ముగపాండ్యన్, విజయ ప్రభాకరన్ ఉన్నారు. ఈ సందర్భంగా పీయూష్ గోయల్ కెప్టెన్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపి ఓదార్చారు. అంతకుమందు హాస్య నటుడు, హీరో సూరి కూడా విజయకాంత్‌కు నివాళి అర్పించారు. అదేవిధంగా స్థానిక కోయంబేడులోని డీఎండీకే ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో ఉన్న విజయకాంత్ సమాధికి నగరానికి చెందిన 50 మంది హిజ్రాలు గజమాల వేసి అంజలి ఘటించారు. అదేవిధంగా విజయకాంత్‌కు రాష్ట్రంలో తొలి సారి ధర్మపురిలో విగ్రహాన్ని ఆయన అభిమానులు ఏర్పాటు చేశారు.


కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ నివాళి

నయనతార భర్తకు ఎల్ఐసీ నోటీసు


'ఎల్ఐసి' పూజా కార్యక్రమం

చిత్రజ్యోతి

అగ్రనటి నటి నయనతార భర్త, సినీ దర్శకుడు విఘ్నేష్ శివన్‌కు భారత జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులు అందుకున్న వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని పేర్కొంది. అయితే, విఘ్నేష్‌శివన్‌కు ఎల్ఐసీ నోటీసులు జారీ చేయడం వెనుక ఓ కారణం ఉంది. బ్లాక్‌బస్టర్ మూవీ 'లవ్‌టుడే' ఫేం ప్రదీప్ రంగనాథన్ హీరోగా విఘ్నేష్ శివన్ "ఎల్ఐసి" (లవ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్) అనే టైటిల్‌లో కొత్త చిత్రాన్ని రూపొందిస్తున్నారు. సెవెన్ స్క్రీన్ స్టూడియోస్ ఈ చిత్రాన్ని నిర్మించనుంది. అయితే, ఈ టైటిల్‌పై ఆది నుంచి వివాదం నెలకొంది. ఈ టైటిల్ తమకు సొంతమైనదని దర్శకుడు ఎస్ఎస్ కుమార్ ఇప్పటికే ప్రకటించి, నిర్మాతల మండలి దృష్టికి తీసుకెళ్లారు. ఇపుడు భారత జీవిత బీమా సంస్థ కూడా ఈ టైటిల్‌పై అభ్యంతరం వ్యక్తం చేసింది. 'ఎల్ఐసి' అనేది తమ సంస్థకు రిజిస్టర్ చేసిన పేరని, ఈ పేరును ఇతరులు ఉపయోగించడం చట్ట వ్యతిరేకమంటూ దర్శక, నిర్మాతలకు నోటీసులు జారీచేసింది. ఈ నోటీసుకు 7 రోజుల్లో సమాధానం ఇవ్వకుంటే, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొంది. దీంతో నిర్మాణ సంస్థ ప్రత్యామ్నాయ టైటిల్ కోసం అన్వేషిస్తున్నట్టు తెలుస్తుంది.

జల్లికట్టు పోటీలకు సిద్ధమవుతున్న ఎద్దులు


జల్లికట్టుకు సిద్ధమవుతున్న ఎద్దు



జల్లికట్టు ఎద్దును ఈతకొలనులో స్నానం చేయిస్తున్న మురుగన్

చెన్నై, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): యేటా సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా తమిళుల ప్రాచీన సాహసక్రీడ జల్లికట్టు పోటీలు నిర్వహించడం ఆనవాయితీ. మదురై అలంగానల్లూరు, పీలమేడు తదితర ప్రాంతాల్లో నిర్వహించే జల్లికట్టు పోటీలు ప్రపంచ ప్రఖ్యాతిగాంచాయి. సంక్రాంతి సమీపిస్తుండడంతో జల్లికట్టు ఎద్దుల యజమానులు పోటీలకు తమ ఎద్దులను సిద్ధం చేస్తున్నారు. జల్లికట్టు వీరులతో వాటికి శిక్షణ కూడా అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో దిండుగల్ సమీపం సిరుమలై ప్రాంతానికి చెందిన మురుగన్ నాలుగు దశాబ్దాలుగా జల్లికట్టు ఎద్దులను పెంచి, యేటా జరిగే క్రీడల్లో వాటిని పాల్గొనేలా చేస్తున్నారు. ప్రస్తుతం మరక్కాళై, వీరకొంబు కాళై, సెవలక్కాళై అంటూ మూడు జలికట్టు ఎద్దులను పెంచుతున్నారు. ఈ ఎద్దులకు ప్రతిరోజూ మినుమలు, శెనగలు, గానుగ చెక్క, ఖర్జూరం వంటి పోషకాలు మెండుగా ఉన్న ఆహారాన్ని అందిస్తున్నారు. జల్లికట్టు ఎద్దుల కోసం ప్రత్యేకంగా ఈతకొలను కూడా నిర్మించారు. రోజూ వాటిని వాకింగ్‌కు తీసుకెళుతున్నారు. జల్లికట్టు వీరులను కూడా రప్పించి తోటలోనే వాడివాసల్‌ను ఏర్పాటు చేసి ఆ ఎద్దులతో క్రీడలు జరుపుతున్నారు. సంక్రాంతి వరకు శిక్షణ పొందిన తర్వాత అలంగానల్లూరు, పాలమేడు, పుదుకోట ప్రాంతాల్లో జరిగే జల్లికట్టు క్రీడలలో ఆ ఎద్దులు పాల్గొంటాయని మురుగన్ అనే శిక్షకుడు చెప్పారు. జల్లికట్టు ఎద్దులను కన్నబిడ్డల్లా పెంచుతున్నానని, గతంలో ఈ ఎద్దులు పుదుకోట తదితర ప్రాంతాల్లో జరిగిన పలు పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుచుకున్నాయని చెప్పారు. జల్లికట్టు పోటీలపై కఠిన ఆంక్షలు విధించడం భావ్యం కాదని, ఆన్‌లైన్‌లో ఎద్దులను ఎంపిక చేసే పద్ధతిని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. జల్లికట్టు పోటీల్లో ఎద్దులను టోకెన్ల పద్ధతిలో ఎంపిక చేయాలని కోరారు. కాగా తమిళుల ప్రాచీన సాహస క్రీడగా పేరుగడించిన జల్లికట్టు పుదుకోట జిల్లా తచ్చంకురిచ్చిలో ఈనెల 6న అట్టహాసంగా ప్రారంభమైంది. రాష్ట్రంలో యేటా తొలి జల్లికట్టు తచ్చంకురిచ్చిలోనే ప్రారంభం కావడం ఆనవాయితీ.

తిరువణ్ణామలైలో బ్రేక్ దర్శనం రద్దు

అడయార్, జనవరి 8: ప్రముఖ పుణ్యక్షేత్రం తిరువణ్ణామలైలోని అరుణాచలేశ్వర స్వామి దేవస్థానంలో బ్రేక్ దర్శనాలను రద్దు చేశారు. ఈ నిర్ణయం తక్షణం అమల్లోకి వస్తుందని ఆలయ అధికారులు వెల్లడించారు. ప్రతి నెలా పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ కు లక్షలాది మంది భక్తులు తరలివస్తున్నారు. ముఖ్యంగా గత యేడాదిగా ఈ ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య ఒక్కసారిగా పెరిగిపోయింది. పౌర్ణమి రోజున రూ.50 ప్రత్యేక దర్శనాన్ని కూడా రద్దు చేసి, కేవలం సర్వదర్శనం మాత్రమే అమలు చేస్తున్నారు. దీనికి కనీసం 4 నుంచి 5 గంటల సమయం పడుతోంది. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులతో పాటు అసౌకర్యానికి గురవుతున్నారు. కొందరు భక్తులు అయితే క్యూలో గంటల తరబడి నిల్చోలేక స్పృహ కోల్పోతున్నారు. పైగా ఈ ఆలయంలో గర్భగుడికి సమీపంలో ప్రశాంతంగా కూర్చొని అరుణాచలేశ్వర స్వామిని దర్శనం చేసుకునే వెసులుబాటు పౌర్ణమితో పాటు వారాంతపు రోజుల్లో ఉండేది. దీనివల్ల సర్వ దర్శనం భక్తులను గంటల తరబడి నిలిపివేస్తున్నారు. అయితే, భక్తుల రద్దీ కారణంగా జనవరి 5వ తేదీ శుక్రవారం నుంచి ఈ దర్శనాన్ని శాశ్వతంగా రద్దు చేస్తున్నట్టు ఆలయ అధికారులు వెల్లడించారు. ఈ నిర్ణయాన్ని భక్తులు స్వాగతిస్తున్నారు.

పుదుచ్చేరిలో మొత్తం ఓటర్లు 10.20 లక్షలు



పుదుచ్చేరి, జనవరి 8: రాష్ట్ర హోదా కలిగిన కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో శుక్రవారం తుది ఓటర్ల జాబితాను వెల్లడించారు. ఈ జాబితా ప్రకారం ఆ రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 10,20,914గా ఉంది. వీరిలో 4,79,329 పురుష ఓటర్లు, 5,41,437 మంది మహిళా ఓటర్లు, 148 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. అయితే, గత యేడాది అక్టోబరు నెల 27న వెల్లడించిన ఓటర్ల ముసాయిదా జాబితాలో మొత్తం ఓటర్ల సంఖ్య 10,007,179గా ఉంది. వీరిలో 4,73,354 పురుష ఓటర్లు, 5,33,680 మంది మహిళా ఓటర్లు, 145 మంది ఉన్నారు. తాజాగా ప్రకటించిన జాబితాలో ఈ సంఖ్య పెరిగింది. ఇందులో 18 నుంచి 19 యేళ్ళ వయస్సున్న యువ ఓటర్లు 26,959 మంది ఉన్నారు. వీరంతా తొలిసారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఓటర్ల జాబితా మార్పులు చేర్పుల్లో కొత్తగా 36,044 మంది ఓటర్లు జాబితాలో చేరారు. మరో 22,309 మంది ఓటర్లు జాబితా నుంచి తొలగించారు. ఈ కొత్త జాబితాలో పురుష ఓటర్ల కంటే 61,108 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. పుదుచ్చేరి రాష్ట్రంలోని మొత్తం 30 అసెంబ్లీ నియోజకవర్గాల్లో విల్లియనూరు సెగ్మెంట్‌లో అత్యధికంగా 45,762 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 21,976, మహిళా ఓటర్లు 23,772, థర్డ్ జెండర్ ఓటర్లు 14 మంది ఉన్నారు. అతి తక్కువ ఓటర్లు కలిగిన నియోజకవర్గంగా ఉరులైయన్ పేట సెగ్మెంట్ నిలిచింది. ఈ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 25,019 మంది ఉండగా, ఇందులో పురుషులు 11,543 మంది, మహిళలు 13,464 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 12 మంది ఉన్నారు.

అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవ ప్రత్యేక రైలు



అడయార్, జనవరి 8: భారత్ గౌరవ్ పథకం కింద సేవలను అందించే అత్యంత విజ యవంతమైన ప్రైవేట్ రైలు 'ఉలా' అయోధ్య రామమందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని తన తీర్థయాత్ర వివరాలను బుధవారం వెల్లడించింది. వారణాసి - అయోధ్య - ప్రయాగ్ రాజ్‌కి ఫిబ్రవరి 8నుంచి 14వ తేదీ వరకు మొత్తం ఏడు రోజుల పాటు పవిత్ర నగరాల ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రాముఖ్యతను వివరిస్తూ కొనసాగుతుంది. వారణాసి పట్టణం ఆధ్యాత్మిక విశిష్టతను వివరించడం, అయోధ్యలోని రామమందిరంలో ప్రారంభోత్సవాన్ని చూడటం, ప్రయాగ్‌రాజ్ పవిత్ర సంగమం ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఆస్వాదించేలా కొనసాగుతుంది. ఇది చెన్నై నుంచి బయలుదేరి గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, గుంటూరు, మిర్యాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్, కాజీపేట్, మంచిర్యాల, సిర్పూర్ కాగజ్‌నగర్ స్టేషన్‌లలో ఆగి, పర్యాటకులను ఎక్కించుకుని బయలుదేరుతుంది. పర్యాటకులకు యాత్ర పొడవునా అన్ని ఆధ్యాత్మిక, చారిత్రాత్మక వివరాలను వెల్లడించేందుకు వీలుగా పీఏ సిస్టమ్స్, సీసీ కెమెరాలు, కోచ్ సెక్యూరిటీ, టూర్ మేనేజర్లు, ట్రావెల్ ఇన్సూరెన్స్, హోటల్, సందర్శన, రవాణా, మూడు పూటలా దక్షిణ భారత భోజనం సహా వివిధ రకాలైన సౌకర్యాలను కల్పిస్తారు. యాత్రికులు ఎల్టీసీ, ఎల్ఎఫ్‌సీ సౌకర్యం కూడా పొందవచ్చు. ఇందులో స్లీపర్ క్లాస్ టిక్కెట్ రూ.16,400గాను, స్లీపర్ క్లాస్ (ఎకానమీ) టిక్కెట్ రూ.19,400, థర్డ్ ఏసీ (కంఫర్ట్) రూ.25,800, సెకండ్ ఏసీ (డీలక్స్) టిక్కెట్ రూ.31,800గా నిర్ణయించారు. పూర్తి వివరాలకు నెం. 78761 01010లో లేదా "www.rail-tourism.com' అనే వెబ్‌సైట్‌లో చూసి తెలుసుకోవచ్చని ట్రావెల్ టైమ్స్ ప్రొడక్ట్ మేనేజర్ విఘ్నేష్ పేర్కొన్నారు.



ముగ్గులపోటీ విజేతలతో చెన్నై తెలుగు అసోసియేషన్ నిర్వాహకులు

వేడుకగా చెన్నై తెలుగు అసోసియేషన్ సంక్రాంతి సంబరాలు

ప్యారీస్, జనవరి 8: నగర శివారులోని అరక్కోణం సమీపంలో ఉన్న ఉళందై మప్పేడు గార్డెన్‌లో చెన్నై తెలుగు అసోషియేషన్ (సీటీఏ) ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు, వనభోజన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ముగ్గుల పోటీలు, పరుగు పందెం, మ్యూజికల్ చైర్ పోటీల్లో మహిళలు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు, సీటీఏ అధ్యక్షుడు కేఆర్కే బాలాజీరావు, కార్యదర్శి వైఎస్‌వి సుబ్బారావు, కల్చరల్ కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి మల్లికార్జున ఇతర కమిటీ నిర్వాహకులు సభ్యులతో ఈ సంబరాలు సందడిగా సాగాయి. మధ్యాహ్నం ఆంధ్రా వంటకాలతో విందు, సాయంత్రం విజేతలకు బహుమతులు పంపిణీ చేసి తెలుగు సంప్రదాయానికి సీటీఏ నిర్వాహకులు అద్దం పట్టారు.


సీనియర్ సభ్యుడిని సత్కరిస్తున్న అసోసియేషన్ నిర్వాహకులు

అలరించిన సాధన, భావనల నృత్య ప్రదర్శన

ప్యారీస్, జనవరి 8 : స్థానిక టి.నగర్ తిరుమలైపిళ్లై వీధిలోని భారత్ కళాచార్ 2024 ఉత్సవాల్లో తెలుగు కుటుంబానికి చెందిన సాధన, భావన గొల్లపూడి నృత్యం ఆద్యంతం ఆకట్టుకుంది. గురువు డాక్టర్ రత్నకుమార్ (నట్టువాంగం) శ్రీకాంత గోపాలకృష్ణ (గాత్రం) ఎస్‌కే కేశవన్ (మృదంగం), బి.ముత్తుకుమార్ (వేణువు) వాద్య సహకారంతో ఆదివారం రాత్రి 7.30 గంటలకు ప్రత్యేక పూజ, జ్యోతి ప్రజ్వలనం, వినాయకస్తుతితో ప్రారంభమైన ప్రదర్శనలో ఐదు కీర్తనలకు నర్తకీమణులు హావభావాలు ప్రదర్శించి అరుదైన భంగిమలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అమెరికాలో స్థిరపడిన గొల్లపూడి భావనారాయణ, సరితా లక్ష్మి దంపతుల కుమార్తెలైన వీరు ఈ యేడాది మార్గ శిర ఉత్సవాల్లో ఇప్పటివరకే చెన్నైలో మూడు నాట్య ప్రదర్శనలు ఇచ్చి పలువురి ప్రశంసలందుకున్నారు. భారత్ కళాచార్ నిర్వాహకుడు, సీనియర్ నటుడు వైజీ మహేంద్రన్, ప్రముఖ మృదంగ విద్వాన్ శ్రీనివాసన్, ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ (వామ్) గ్లోబల్ అధ్యక్షుడు తంగుటూరి రామకృష్ణ, సీనియర్ సిటిజెన్ ఫోరం చైర్మన్ ఊరా బాబూరావు, సరస్వతి దంపతులు, కేకే త్రినాథ్‌కుమార్ సహా పలువురు కళాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైజీ మహేంద్రన్ మాట్లాడుతూ... సాధన, భావన ఒకే సమయంలో ఒకే కీర్తనకు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్య భంగిమలు మహా అద్భుతమని, ఇవి మార్గళి ఉత్సవాల్లో అరుదైన ముద్రగా నిలిచిపోతుందని ప్రశంసించారు. తంగుటూరి రామకృష్ణ మాట్లాడుతూ... అమెరికాలో స్థిరపడిన సాధన, భావన అటు విద్యా,ఉద్యోగ రంగాల్లో రాణిస్తూనే, భారతీయ సంప్రదాయ కళల్లో ప్రావీణ్యం పొంది ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నారని కొనియాడారు. అనంతరం రత్నకుమార్ మాట్లాడుతూ... తన వద్ద నృత్యంలో శిక్షణ పొందిన కళాకారులలో సాధన, భావన ఆదర్శంగా ఉన్నారని అభినందించారు.



సాధన, భావనల అభినయం - నర్తకీమణులను అభినందిస్తున్న నటుడు వైజీ మహేంద్రన్, తంగుటూరి రామకృష్ణ, డాక్టర్ రత్నకుమార్ తదితరులు

ఆచార్య విస్తాలికి జీవిత సాఫల్య పురస్కారం

చెన్నై, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ యూనివర్శిటీ తెలుగుశాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావుకు నెల్లూరుకు చెందిన 'పోట్లూరు సాహిత్య వేదిక' నిర్వాహకులు జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. ఆదివారం సాయంత్రం నెల్లూరు జిల్లా మైపాడు సముద్రతీరంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందించి, ఘనంగా సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జానపద అకాడమీ తొలి అధ్యక్షులు పోట్లూరి హరికృష్ణ ఈ పురస్కారాన్ని అందించారు. మెట్టు రామచంద్రప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో రచయిత పోట్లూరి సుబ్రహ్మణ్యం, దువ్వూరు కల్యాణ్ రెడ్డి, ఎన్.బలరామయ్యనాయుడు, కొండపల్లి శేషగిరి, నాగరాజు, పల్లి వెంకటకృష్ణయ్య తదితరులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య విస్తాలి స్పందిస్తూ.. ఒక రచయిత పురస్కారాన్ని అందుకున్నారంటే వారిలో నూతనోత్తేజం కలగడమే కాక భవిష్యత్తులో నిర్వహించాల్సిన బాధ్యతలను గుర్తు చేసినట్లు అవుతుందన్నారు.


ఆచార్య విస్తాలిని సత్కరిస్తున్న నిర్వాహకులు

5నుంచి మంత్రులపై దాఖలైన అవినీతి కేసుల రోజువారీ విచారణ

ప్యారీస్, జనవరి 8: రాష్ట్రంలో మంత్రులు, మాజీ మంత్రులపై గతంలో దాఖలైన అవినీతి కేసుల విచారణ ఫిబ్రవరి 5వ తేదీ నుంచి రోజువారీ సాగనుంది. పలువురు మంత్రులు, మాజీ మంత్రులపై అనేక అవినీతి కేసులను దిగువ కోర్టులు కొట్టివేశాయి. ఇలాంటి కేసులను మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి ఆనంద్ వెంకటేష్ సుమోటాగా స్వీకరించి విచారిస్తున్నారు. ఈ తరహా కేసులు నమోదైన వారిలో ప్రస్తుత మంత్రులు కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, తంగం తెన్నరసు, మాజీ సీఎం ఓ పన్నీర్‌సెల్వం, మాజీ మంత్రి పి.వళర్మతి తదితరులు ఉన్నారు. వీరిపై దాఖలైన కేసుల్లో తుది విచారణ ఫిబ్రవరి 5వ తేదీ నుంచి మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రారంభంకానుంది. ఫిబ్రవరి 12, 13వ తేదీల్లో జరిగే విచారణలో మంత్రి ఐ.పెరియస్వామి కేసులో తుది విచారణ చేపడుతామని న్యాయమూర్తి ఆనంద్ వెంకటేష్ ఆదేశించారు. ఈ కేసుల విచారణ స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలోని ప్రజా ప్రతినిధుల కేసుల విచారణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టులో సాగనుంది.